ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

గురువారం 4 జూలై 2024 | 3





నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్, అటవీశాఖ అధికారులతో చర్చిస్తున్న పవన్‌కల్యాణ్

సముద్రపు కోత కట్టడికి చర్యలు

- అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూలై 3: ఉప్పాడ సముద్రతీర ప్రాంతాల్లో కోత ప్రభావాన్ని కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. బుధవారం ఉప్పాడ సముద్రపు కోతను పరిశీలించిన అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసంలో నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్, అటవీశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కోత ప్రభావం కట్టడి చేసేందుకు ఉద్దేశించిన ప్రణాళికను అధికారులు వివరించారు. సమావేశంలో ప్రొఫెసర్ రమణమూర్తి, సీనియర్ సైంటిస్ట్ కిరణ్‌రాజు, జిల్లా కలెక్టరు షాన్‌మోహన్, డీఎఫ్‌వో భరణి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ సముద్రపుకోత ప్రాంతం పరిశీలన

ఉప్పాడ(కొత్తపల్లి), జూలై 3: సముద్రకోత నివారణకు శాస్త్రీయ పరిష్కారాన్ని అన్వేషించాలని డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. తరచూ సముద్రకోతకు గురయ్యే ఉప్పాడ, సూరాడపేట ప్రాంతాల్లో బుధవారం ఆయన మారిటైం బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో సముద్రకోత, సముద్రం ఎందుకు ముందుకొస్తుంది, దానికిగల కారణాలు, శాశ్వతంగా ఉప్పాడ గ్రామాన్ని సముద్రకోత నుంచి రక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఉప్పాడ తీరప్రాంతంలో 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్ర గర్భంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీనారాయణ వివరించారు. 60ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20ఎకరాలు సముద్రంలో కలిసిపోయిందని చెప్పారు. మొత్తం కొత్తపల్లి మండల పరిధిలో 8తీరప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు సముద్రంలో కలిసిపోయిందన్న విషయాన్ని తెలుసుకుని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారి వెంట టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జనసేన పిఠాపురం నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణంరాజు, జనసేన జాతీయ మీడియాఅధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో పవన్‌కల్యాణ్ పూజలు

పిఠాపురం, జూలై 3: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. పాదగయ క్షేత్రంలో తొలుత విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామి, స్వయంభూ దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవీలను దర్శించుకున్నారు. అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అష్టోత్తర పూజ నిర్వహించిన అర్చకులు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఆశీర్వచనాలు పలికారు. పవన్‌కల్యాణ్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అసిస్టెంట్ కమిషనర్ దుర్గాభవాని ప్రసాదాలు అందజేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 5లో

గుండెల్లో పెట్టుకుని పాలిస్తా!

- ప్రజల ముందు పవన్‌కల్యాణ్ ప్రమాణం
- సమస్యల పరిష్కారానికి కొంత సమయం కావాలి
- రూ.100 కోట్లతో పిఠాపురం టెంపుల్ సర్క్యూట్
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు చర్యలు
- పిఠాపురం సీహెచ్‌సీని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి
- ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్... ఏడాదిలో నిర్మాణం
- గొల్లప్రోలులో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు హామీ
- పిఠాపురంలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తాం
- ఉప్పాడ సముద్రపు కోతకు పరిష్కారం చూపిస్తాం
- తీరప్రాంతం ఏడాదిన్నరలోగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి
- పిఠాపురం వారాహి విజయభేరి సభలో డిప్యూటీ సీఎం పవన్





పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో వారాహిపై నుంచి మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, హాజరైన జనం.. వాహనంపై ఇతర నేతలు

పిఠాపురం, జూలై 3: భారతదేశం అంతా ఇటువైపు చూసేలా తీర్పు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని పాలిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవనకల్యాణ్ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకుగాను పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం సాయంత్రం వారాహి విజయభేరి సభ నిర్వహించారు. ఈ సభలో ప్రజల సాక్షిగా మీ ముందు ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్నానంటూ పవన్‌కల్యాణ్ అనే నేను భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, పెద్దలు, ప్రముఖులు, యువత, మహిళలు, అన్ని వర్గాల వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు అందరికీ హామీ ఇస్తున్నాను.. మానవత్వాన్ని కాపాడతానని, మీ అభ్యున్నతికి నిరంతరం కష్టపడతానని, లంచాలు తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. సమస్యల పరిష్కారానికి కొంత సమయం ఇవ్వాలని పవన్ కోరారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠాధిపతి అయిన పురుహూతికా అమ్మవారిని కేంద్రంగా చేసుకుని ప్రసాద్ స్కీమ్ కింద రూ.100 కోట్లతో పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని పవన్ తెలిపారు. ఇదే విషయంపై ప్రధాని మోదీని కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్ కోరారని చెప్పారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పిఠాపురం సీహెచ్‌సీని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడ బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తామని, దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని వివరించారు. నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం-ఉప్పాడ మధ్యగల రైల్వేగేటువద్ద ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీని కలిసి ఇదే కోరతానని తెలిపారు. అధికారులు సమయం పడుతుందని చెప్పినా ఎవరితో మాట్లాడాలో చెప్పండి, ఏడాదిలోగా పూర్తి కావాలని చెప్పానన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలును సెరీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని.. చిత్తూరు, మదనపల్లి, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే రీలింగ్, ఆప్టిమైజింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. గొల్లప్రోలు మండలంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని, ఇక్కడ కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దుర్గాడలో మిర్చి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని తెలిపారు. పిఠాపురం పశువుల సంత అభివృద్ధికి చర్యలు చేపట్టామని... ఒకటి, రెండు రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఉప్పాడ-కాకినాడ తీరప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

ఉప్పాడ సముద్ర తీరప్రాంతంలో కోత నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు ఉప్పాడ-కాకినాడ మధ్యగల 11-13 కిలోమీటర్ల తీరప్రాంత రహదారిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పవన్ తెలిపారు. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేలా, యువత ఆడుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, అదే సమయంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వచ్చే సోమ, మంగళవారాల్లో ఆ డాక్యుమెంట్‌ను రిలీజ్ చేస్తామని చెప్పారు. నేను ఇక్కడకు రాకపోయినా ఎప్పటికప్పుడు నేను నియోజకవర్గానికి ఏ పనిచేశానో చెబుతానని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాల భూమి ఉందని, ఇక్కడ భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ఇక్కడ పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.



ఉప్పాడలో సముద్ర తీరం కోతను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

నాపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయనని పవన్‌కల్యాణ్ అన్నారు. రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేస్తానని, తొలుత గుంతలు పూడ్చే పనులు చేపడతామని తెలిపారు. మీరు ఇచ్చిన శక్తి నన్ను ఉపముఖ్యమంత్రిని చేసిందని చెప్పారు. నన్ను గుండెల్లో పెట్టుకున్న స్థానాన్ని చివరి శ్వాసవరకూ, జగద్దేవిలో ఐక్యం అయ్యే వరకూ కాపాడుకుంటానని తెలిపారు. దత్తాత్రేయ పరంపరను ఆచరించిన వాడిని, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర చదివిన వాడిని కాని స్వామి దర్శనం మాత్రం త్వరగా అవ్వలేదని చెప్పారు. 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడకు వచ్చినా శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకోలేకపోయాయని, ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని ప్రకటించిన తర్వాత ఆ స్వామి దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. 2028 నాటికే పిఠాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్ది ఎవ్వరైనా పోటీకి రావాలంటే ఆలోచించేలా చేస్తానని చెప్పారు. పిఠాపురం అభివృద్ధి దేశానికి మోడల్‌గా మారుతుందని తెలిపారు. మీరు గర్వించేలా కష్టపడి పనిచేసి ఈ నేల రుణం తీర్చుకుంటానని చెప్పారు.

నేను ఇక పిఠాపురం వాస్తవ్యుడినే...

తాను ఈరోజు నుంచి పూర్తిగా పిఠాపురం వాస్తవ్యుడినేనని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మాట మీ అందరి ముందు గౌరవంగా చెబుతున్నానని తెలిపారు. మూడు ఎకరాల స్థలం తీసుకున్నానని, కొనుగోలు పత్రాలపై ఈరోజే సంతకం చేశానని చెప్పారు. ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఒకటి నుంచి రెండు ఎకరాల స్థలం పార్టీ కార్యాలయం నిర్మాణం చేపడతామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అందరి వచ్చి కూర్చొనేలా ఏర్పాట్లుచేస్తామని చెప్పారు. తనకు వినతులు ఇచ్చేందుకు వస్తున్న వారి నుంచి పిటిషన్లు తీసుకునేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఇందులో వైద్యపరమైన వాటికి అధిక ప్రాధాన్యమివ్వాలని, శాంతి భద్రతలు, కిడ్నాప్ అదృశ్యం కేసులు, యువత ఉపాధి అవకాశాలకు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జాబ్‌మేళా నిర్వహిస్తామని, యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు.

వర్మ చెప్పిన మాట నిజమయ్యింది

అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని, అసెంబ్లీలోకి అడుగు పెట్టలేవని వైసీపీ నేతలు అన్నారు. అప్పుడు వర్మ ఒక మాటన్నారు. అసెంబ్లీ గేట్లు తోసుకుంటూకాదు బద్దలుకొట్టుకుంటూ పవన్ వస్తాడని, ఆ మాటే నిజమైందని, ప్రజలు సీరియస్‌గా తీసుకుని తనను డిప్యూటీ సీఎం సీటులో కూర్చొబెట్టారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ విజయాన్ని పిఠాపురం నియోజకవర్గ ప్రజలకే అంకితం చేస్తున్నానని చెప్పారు. సభలో ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పాల్గొన్నారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాలో మూడు రోజులు జరిపిన పర్యటన బుధవారం రాత్రి పర్యటన ముగిసింది. 1న పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన ఆయన గొల్లప్రోలు పట్టణంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం, సాయంత్రం జనసైనికులు, వీరమహిళల సమావేశంలో పాల్గొని తన గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2న కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యావరణశాఖల సమీక్షలు చేశారు. బుధవారం ఉప్పాడలో సముద్రపుకోత ప్రాంతాన్ని అధికారులు, నిపుణులతో కలిసి పరిశీలించారు. అనంతరం పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో వారాహి విజయభేరి సభలో పాల్గొన్నారు.

పాలనాపరమైన సంస్కరణలతో అభివృద్ధి పథంలో జిల్లా

- ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ త్రినాథ్

కాకినాడ సిటీ, జూలై 3: జిల్లాను అభివృద్ధి పథంలో నడపడానికి పాలనాపరమైన సంస్కరణలతోపాటు ఉద్యోగులపట్ల నూతన కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ మానవత్వాన్ని చాటారని ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా శాఖ చైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ అభినందనలు తెలిపారు. కాకినాడ జిల్లాలో వివిధశాఖల్లో పనిచేస్తూ తీవ్రమైన అనారోగ్య కారణాలవల్ల మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో ఉన్న కేస్‌లపై బోర్డు రికమెండ్ చేసినా ఈనాటికీ ఆమోదం లభించక పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో అనేక కుటుంబాలు జీతభత్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇదే కోవలో పిఠాపురం మండలం మల్లాం గ్రామ వీఆర్‌వో సి.నూకాలు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మెడికల్ ఇన్‌వాలిడేషన్‌పై రిటైర్ అయ్యేందుకు, కుటుంబ పోషణకోసం వారి కుమారుడికి ఉద్యోగం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నామన్నారు. ప్రొసీజర్ ప్రకారం మెడికల్ బోర్డ్ రికమండ్ చేసినా ఆమోదం తెలపక ఆరునెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. అయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసినా అధికారులకు కనికరించలేదన్నారు. అర్జీదారుడి కుటుంబ పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని నూతన కలెక్టర్‌కు తెలపగా వెంటనే స్పందించి క్యాన్సర్ బాధితుడైన ఉద్యోగిని స్వయంగా పరిశీలించి ఆమోదం తెలిపారన్నారు. పాలనలో మానవత్వాన్ని అన్నివర్గాల వారు కోరుకుంటారన్నారు. పాలనను పరిగెత్తిస్తూ కలెక్టర్ మానవత్వాన్ని చాటారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా శాఖ తరఫున అధ్యక్షుడు త్రినాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'అల్లూరి' జయంతి వేడుకలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 3: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమం గురువారం ఉదయం 9.30గంటలకు కాకినాడ నాగమల్లితోట జంక్షన్‌వద్దగల అల్లూరి సీతా రామరాజు విగ్రహంవద్ద నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన బుధవారం విడుదల చేశారు. కాకినాడలోని నాగమల్లి తోట జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తారు. దీనికి ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పురుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్ ప్రారంభం 5లో

- తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు
- హాజరైన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

వేద పాఠశాల విద్యార్థులకు డయేరియా? 5లో

- రత్నగిరిపై కలకలం
- వాంతులు, విరేచనాలతో ఆరుగురికి అస్వస్థత
- చికిత్స అందిస్తున్న వైద్యులు

ప్రైవేట్ ట్రావెల్ బస్సు సీజ్ 5లో

- రూ.2.88 లక్షల జరిమానా

6 నుంచి లోవలో ఆషాడ మాసోత్సవాలు 5లో

పురుషోత్తంపట్నం ఫేజ్-2ను వినియోగంలోకి తీసుకురండి

- ప్రభుత్వానికి మెట్ట రైతుల విజ్ఞప్తి

జగ్గంపేట, జూలై 3: గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి తరలించడంలో భాగంగా పురుషోత్తమపట్నం ఫేజ్-1 నుంచి గోదావరి జలాలను లిఫ్ట్ చేసి తద్వారా పోలవరం కాలువ ద్వారా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో రూ.600 కోట్లతో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుషోత్తపట్నం ఫేజ్-2ను నిర్మించారు. దీనిద్వారా గోదావరి జలాలను ఏలేరుకు అనుసంధానం చేసి ఏలేరు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడంతో మెట్టప్రాంతమైన జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందించవచ్చు. ప్రతి రైతు కూడా పంటలు వేసుకుని పూర్తిస్థాయిలో వ్యవసాయ సాగు చేసుకునే వీలుంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫేజ్-2ను ట్రిబ్యునల్ పేరిట కోర్టులో వేసి ఆ ప్రాజెక్టును నిలుపుదల చేసింది. రైతులకు జగన్ అనేక వాగ్దానాలు చేశారే తప్ప మెట్ట ప్రాంతానికి నీరు అవసరమైన ఈ ప్రాజెక్టును నిరుపయోగం చేయడంపై రైతులు చాలా ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతులకు అవసరమైన ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల కాలంలో వర్షాలు సరిగా లేకపోవడంతో ఏలేరులో డెడ్‌స్టోరేజీ స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో ఏలేరుకు కచ్చితంగా వర్షాలు కురిస్తేనే నీరు వస్తుంది. గోదావరి జలాలను పురుషోత్తపట్నం ఫేజ్‌టు ద్వారా లిఫ్ట్ చేసి ఏలేరుకు తోడి సాగునీటిని సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాభాగస్వామ్యంతోనే డయేరియా నివారణ: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), జూలై 3: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంకోసం కాచి చల్లార్చిన నీటిని తాగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. డయేరియా బారిన పడి కలుషిత ఆహారం వల్ల వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు హాస్టల్ విద్యార్థులను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డయేరియా బారిన పడిన హాస్టల్‌లో నీటి నమూనాలు, ఆహార పదార్థాలు సేకరించామని, వీటిని పరీక్షించేందుకు కాకినాడ జీజీహెచ్ మైక్రోబయోలజీకి అందిస్తామన్నారు. చికిత్స పొందుతున్న వారంతా ఆరోగ్యం సురక్షితంగా ఉన్నారన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధులు వస్తాయని, వీటి రక్షణకోసం పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీరు లేకుండా చేయాలన్నారు. జిల్లాలో 787 ట్యాంకులను శుభ్రం చేసి సురక్షితమైన మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. డయేరియా క్యాంప్ జరుగుతుందని ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ పాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు, డయేరియా ఉంటే తక్షణమే 7093930574, 7207118051 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

ఎట్టకేలకు అక్రమ కట్టడం కూల్చివేత

కార్పొరేషన్(కాకినాడ), జూలై 3: కాకినాడ గొడారిగుంటలో అక్రమ కట్టడం కూల్చివేత కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కూల్చివేతను అడ్డుకోవడానికి రావడంతో రసాభాసగా మారింది. ఎట్టకేలకు ఉన్నతాధికారుల సహకారంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ద్వారంపూడిని వెనుక్కు పంపించి రెండోఫ్లోర్‌లో అక్రమంగా నిర్మించిన ఇంటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. రాత్రంతా కొనసాగిన ఆ కార్యక్రమం టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిచేశారు. ఈ సందర్భంగా డీసీపీ హరిదాసు మాట్లాడుతూ నగరంలో ఇలాంటి కట్టడాలు ఎక్కడున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. కూల్చివేతలను అడ్డుకోబోయిన ద్వారంపూడి అనుచరులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

'సార్వత్రిక విద్యలో ఉత్తమ ఫలితాలు'

కాకినాడ రూరల్, జూలై 3: గతనెలలో నిర్వహించిన సార్వత్రిక విద్య పది, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 827మంది హాజరుకాగా 774మంది ఉత్తీర్ణత సాధించగా మొత్తం 93.59శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 2వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 1457మంది హాజరుకాగా 1268మంది ఉత్తీర్ణత సాధించగా 87.03శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 3వస్థానంలో నిలిచినట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులు రీకౌంటింగ్, వెరిఫికేషన్ కోసం ఈనెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సార్వత్రిక విద్య కాకినాడ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణ సూచించారు.

బియ్యం గోదాముల్లో దాడులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 3: కాకినాడ నగరంలో బియ్యం గోదాములపై దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం కాకినాడ పోర్టు, చొల్లంగి, తాళ్లరేవు మండలాల్లో దాడులు జరిగాయి. కాకినాడ పోర్టు ఏరియాలో సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్ సీటీకే గొడౌన్లలో తనిఖీలు చేయగా 1482 మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.3కోట్ల54లక్షలు ఉంటుందని అధికారులు ప్రకటించారు. చొల్లంగి, తాళ్లరేవు గోదాముల్లో పీడీఎస్ బియ్యం లభించలేదు.

ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారు

జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



నీరు విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సీతానగరం, జూలై 3: రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను, పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం గ్రామంలోని పుష్కర-1, పుష్కర-2 ఎత్తిపోతల పథకాలతోపాటు పురుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్‌కు మంత్రి స్విచ్‌ఆన్ చేసి సాగునీరు విడుదల చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతితో కలసి పాల్గొన్న మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన పంపులు సిద్ధంచేసి 15 రోజుల ముందుగానే రైతులకు నీరందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. 3 వేల క్యూసెక్కుల సామర్థ్యం గల పురుషోత్తపట్నం పంపింగ్‌స్కీం ద్వారా 60 వేల ఎకరాలకు, పుష్కర1, పుష్కర2 ఎత్తిపోతల పథకాల నుంచి 1.40 లక్షల ఎకరాలకు 1400 క్యూసెక్కుల సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టూరి రంగారావు, గద్దే వెంకట కృష్ణచౌదరి, పోలిన కృష్ణ, వలవల రాజా, వలవల నానాజీ, కాండ్రు శ్రీనివాసరావు లక్కిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల

తాళ్లపూడి, జూలై 3 : రైతు సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్నారు. తాళ్లపూడి మండలం తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టుకు మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు సాగునీటిని విడుదల చేశారు. తొలుత పూజలు చేసి, అనంతరం గోదావరి నదికి హారతులిచ్చి మోటారు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 14 మండలాల్లో 135 గ్రామాల రైతాంగానికి కాలువల ద్వారా 2 లక్షల 6 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. పంపింగ్ స్కీం నుంచి లక్షా 38 వేల ఎకరాలకు కాలువల ద్వారా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న 65 వేల ఎకరాలకు సబ్ లిఫ్టుల ద్వారా సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశుతోష్ శ్రీవాస్తవ, ఇరిగేషన్ ఏపీ స్టేట్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఈఈలు దేవప్రకాష్, ఏసుబాబు, డీఈ రామేశంనాయుడు, ఏఈలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, నామన పరమేశ్వరరావు, ముళ్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, గన్నిన సత్తిబాబు, కొఠారు వెంకట్రావు, గంటా కృష్ణ, యువగళం సభ్యులు సత్యేంద్ర, భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు సీజ్

రూ.2.88 లక్షల జరిమానా



పోలీసులు సీజ్ చేసిన బస్సు

శంఖవరం/కార్పొరేషన్(కాకినాడ),జూలై 3: పిఠాపురం నుంచి హైదరాబాద్ ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రయాణికులను తరలిస్తుండడంతో కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేశారు. బస్సుకు రోడ్ ట్యాక్స్ పర్మిట్ వంటి అనుమతులు ఏమీ లేకుండానే ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తించి రూ.2,88,500 లక్షలు ఫైన్ వేశారు. బస్సును సీజ్ చేసి కాకినాడ ఆర్టీసీ డిపోకి తరలించామన్నారు. దూర ప్రయాణం చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి

దివాన్‌చెరువు, జూలై3 : జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువు సెంటర్‌లో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం మండలం తిరుమలాయపాలానికి చెందిన పినమరెడ్డి కొండలరావు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. బొమ్మూరు ఎస్.ఐ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. తిరుమలాయపాలానికి చెందిన కొండలరావు బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తన బైక్‌పై పాలచర్ల వైపు నుంచి శ్రీరాంపురం వైపు వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో రోడ్ క్రాస్ చేస్తున్న సమయంలో విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో కొండలరావు బైక్‌తో సహా లారీ కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. కొండలరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

సీతానగరం, జూలై 3: రఘుదేవపురం పంచాయతీలో జరిగిన అవకతవకలపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నాగలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ఈవోపీఆర్డీ రికార్డులు తనిఖీ లోపాలు ఉన్నాయని నివేదిక ఇవ్వడంతో ఆ నివేదికపై సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికి వారి నుంచి నేటి వరకు ఏ విధమైన సమాధానం రాలేదన్నారు. దీంతో బుధవారం విచారణ చేసి సంబంధిత వ్యక్తుల స్టేట్‌మెంట్‌లు తీసుకున్నట్లు చెప్పారు. అవకతవకలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, కార్యదర్శి బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు

రాజధాని అమరావతి నిర్మాణానికి పింఛన్ విరాళం



పింఛన్ సొమ్ము అందిస్తున్న వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, జూలై 3: రాజధాని అమరావతి నిర్మాణానికి ఓ దివ్యాంగుడు పింఛన్ సొమ్ము అందించి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని బెల్లంపూడి శివారు తాడాలవారిపాలేనికి చెందిన దివ్యాంగుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు బుధవారం జూలై నెల పింఛన్ రూ.6 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, చుట్టుగుళ్ల కిశోర్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పోలిశెట్టి రాజేష్, ఆదిమూలం వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్, షేక్ దొరబాబు, కర్రి బాబూరావు, తాటికాయల బాబ్జి, యర్రంశెట్టి వీరాస్వామి పాల్గొన్నారు.

బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌పై కేసు నమోదు

దివాన్‌చెరువు, జూలై 3: రాజానగరం మండలం జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచికి చెందిన బిజినెస్ కరస్పాండెంట్ నానిబాబుపై బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు అయినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో రూ.40 లక్షల గోల్‌మాల్? అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు ఫిర్యాదు మేరకు గత నెల 20వ తేదీన విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. సంబంధిత బీసీని నియమించిన నోడల్ ఏజెన్సీ ఈ విషయంలో పూర్తిబాధ్యత వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే అంశంపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్.మూర్తి వివరాలు తెలియజేస్తూ జి.ఎర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా సంబంధించిన బీసీ బ్యాంకు లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు విచారణాధికారిగా డీఆర్‌డీఏ అధికారి జనార్ధనరావును నియమించామని తెలిపారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఎటపాక, జూలై 3: పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ హిందువుల పట్ల అనుచితంగా మాట్లాడారని ఆరోపిస్తూ ఎటపాక ప్రధాన రహదారిపై బుధవారం భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూడే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడారు. రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చింత దుర్గారావు, బీజేపీ నాయకులు కల్లూరి కృష్ణ, మడకం వెంకటేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 3: రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సహజ నటుడు ఎస్వీ రంగారావు 106వ జయంతి సందర్భంగా ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత ఆధ్వర్యంలో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరై గోదావరి గట్టున ఉన్న రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎస్వీ రంగారావు వంటి మహనీయులు సినీ రంగానికి చేసిన సేవలు, సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని అన్నారు. సినీ స్టూడియోలు కేవలం తెలంగాణకే పరిమితమయ్యాయని, సినిమా చిత్రీకరణకు అన్ని విధాలా అనువైన నగరంగా ఉన్న రాజమహేంద్రవరం పరిసర ప్రాంతంలో ఒక సినిమా స్టూడియోను ప్రభుత్వ సహకారంతో నిర్మాణం చేపట్టేందుకు తాను తప్పక కృషి చేస్తానని అన్నారు. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నాయకులు యర్రా వేణు గోపాలరావు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఆకుల వీర్రాజు, చల్లా శంకరరావు, కార్యక్రమం నిర్వాహకుడు కొత్తపేట రాజా, నందెపు శ్రీనివాస్, అడపా శ్రీహరి, బాక్స్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థులకు డయేరియా?

రత్నగిరిపై కలకలం

వాంతులు, విరేచనాలతో ఆరుగురికి అస్వస్థత

చికిత్స అందిస్తున్న వైద్యులు



చికిత్స పొందుతున్న వేద విద్యార్థులు

అన్నవరం, జూలై 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సత్యగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవా స్మార్త, ఆగమ పాఠశాలలో కలకలం రేగింది. వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో కొందరికి వాంతులు, విరేచనాలు కావడంతో మిగిలిన విద్యార్థులు అధికారులకు సమాచారమివ్వడంతో హుటాహుటిన వేదపాఠశాలకు చేరుకుని వైద్యచికిత్సలు అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సత్యగిరి కొండపై రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 32 మంది బ్రాహ్మణ విద్యార్థులు ఆగమ, స్మార్తవిద్యను అభ్యసిస్తున్నారు. వీరికి వసతి, ఆహారం దేవస్థానమే ఏర్పాటు చేస్తుంది. అయితే బుధవారం విద్యనభ్యసిస్తున్న వారిలో ముందుగా 15 మంది అస్వస్థతకు గురికాగా 9మందికి ప్రాథమిక చికిత్స ద్వారా కోలుకోగా మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆందోళన కలిగింది. విషయం తెలుసుకున్న ఈవో రామచంద్రమోహన్ వైద్యసిబ్బందిని హుటాహుటిన వెళ్లాలని ఆదేశించడంతో దేవస్థానం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తన సిబ్బందితో చికిత్స అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురికి డయేరియా లక్షణాలుగా గుర్తించామన్నారు. డీఎంహెచ్ఓ ఆదేశాలతో రావికంపాడు పీహెచ్‌సి సిబ్బంది పర్యవేక్షిస్తుండగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంఘటన స్థలానికి చేరుకుని నీరు, ఆహార పదార్థాల శాంపిల్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. విద్యార్థులందరినీ ఆగమ పాఠశాల నుంచి శివసదన్ కాటేజీకి తరలించి అక్కడ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఇతర అధికారులు దగ్గరుండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులంతా కోలుకుని పరిస్థితి సద్దుమణిగిందని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇటీవల ఆర్ఓ ప్లాంట్ పాడవడంతో విద్యార్థులు దేవస్థానం వాటర్‌ట్యాంక్ ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారని. వంటశాల వద్ద పరిసరాలలో ఈగల మోత అధికంగా ఉంటుందని వంటశాల సిబ్బంది చెబుతున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాయక్ విద్యార్థులను పరామర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గురువారం ప్రత్యేకించి దీనిపై ఓ కమిటీ ఏర్పాటు చేసి కారణాలను విశ్లేషించనున్నట్లు చెప్పారు.

6 నుంచి లోవలో ఆషాడ మాసోత్సవాలు

తుని రూరల్, జూలై 3: ఈ నెల 6 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు లోవ దేవస్థానంలో ఆషాడ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు లోవకు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తుల నుంచి వచ్చిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో లోవ దేవస్థానంలో వివిధ పనుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులతో ఆలయ అధికారులు, రూరల్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ కాటేజ్ యజమానులు, వర్కర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు ఇచ్చారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొన్న చర్యలు ఉంటాయని ఎస్ఐ రమేష్ బాబు సమావేశంలో తెలిపారు

లోవలో ఆషాడ మాస ప్రత్యేక పూజలు

జూలై 7 ఆదివారం అమ్మవారికి వివిధ రంగుల మట్టిగాజులతో ప్రత్యేక అలంకరణ, జూలై14 ఆదివారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 15న అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా పంచామృత అభిషేకం, 17న బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా గణపతి అభిముఖం, గరిక పూజ, గణపతి హోమం, అమ్మవారికి లక్ష పత్రి పూజ, 21 ఆదివారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ. అదే రోజు పౌర్ణమి సందర్భంగా చండీ హోమం, 28 ఆదివారం అమ్మవారికి లక్ష పుష్పార్చన, 31 ఏకాదశి సందర్భంగా అమ్మవారికి లక్ష బిల్వార్చన, వచ్చే నెల 3న సప్తనది జలాలతో అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, వచ్చే నెల 4న ఆదివారం 9గంటలకు అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు, ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హైవేకు చేర్చి 3.52 ఎకరాలు కొనుగోలు



పిఠాపురం, జూలై 3: ఎన్నికల ముందు తాను పిఠాపురంలో స్థిర నివాసం ఏర్పరచుకుంటానని, ఇల్లు కట్టుకుంటానని చెప్పిన జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ దిశగా బుధవారం ముందడుగు వేశారు. పిఠాపురం-గొల్లప్రోలు మార్గంలో 216 జాతీయ రహదారికి చేర్చి భూములను కొనుగోలు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని ఇల్లింద్రాడ వై.జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో ఉన్న ఒక రెస్టారెంట్ దగ్గర 3.52 ఎకరాలను పవన్‌కల్యాణ్ కొనుగోలు చేశారు. ఇల్లింద్రాడ రెవెన్యూ పరిధిలోకి వచ్చే 2.08 ఎకరాలు, భోగాపురం రెవెన్యూలోకి వచ్చే 1.44 ఎకరాలను కాకినాడకు చెందిన కోన శ్రీనందు వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం పూర్తి చేశారు. పవన్‌కల్యాణ్ తరపున ప్రతినిధిగా కాకినాడ నగర జనసేన అధ్యక్షుడు డాక్టర్ తోట మెహర్ సీతారామ సుధీర్ పాల్గొన్నారు. ఎకరం కోటి రూపాయలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసినట్లు సమాచారం. భూమి కొన్న విషయాన్ని పిఠాపురం వారాహి బహిరంగసభలో ప్రకటించిన పవన్‌కల్యాణ్ ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకుంటానని, ఇకనుంచి తాను పిఠాపురం వాస్తవ్యుడినేనని చెప్పారు.

నిర్వాసితుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న సీతారాం

ఎటపాక, జూలై 3: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కన్నా, నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటపాకలో సొందే రామారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడారు. సీఎం చంద్రబాబు పోలవరం నిర్మాణం, స్థితిగతులపై సమీక్షలు చేస్తున్నారే తప్పా నిర్వాసితుల ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వచ్చే వర్షాలతో శబరిపోటు పెరిగి, నాలుగు విలీన మండలాలతో పాటు పక్కనే ఉన్న భద్రాచలం వరకు ముంపు ఉంటుందని చెప్పారు. వరద తీవ్రత పెరిగితే ఏజెన్సీలో 300 గ్రామాలు ముంపులో చిక్కుకుంటాయని అన్నారు. ప్రభుత్వం గోదావరి వరద ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న పది మండలాల్లో నిర్వాసితుల ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను గాలికి వదిలేసిందని, ఈ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పునరావాసం కోసం నిర్మించిన ఇళ్లల్లోకి నిర్వాసితులను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవీ, మండల కమిటీ సభ్యులు కాకా అర్జున్, పులుసు బాలకృష్ణ, సోయం వీరమ్మ, రత్తమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 3: వరదల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విలీన మండలాల్లోని ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. విలీన మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వరద పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగానే సురక్షిత ప్రాంతాలలో బఫర్ స్టాక్ ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలను నిర్ణయించుకొని ఆయా ప్రాంతాలలో తాగునీరు, వసతి ఏర్పాట్లను ముందుగానే చేయాలన్నారు. లాంచీలు, మరబోట్ల అవసరాన్ని ముందుగానే గుర్తించి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. వరద తగ్గాక తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా అవసరమైన జేసీబీలు, ట్రాక్టర్ల వివరాలను తనకు నివేదిక ద్వారా అందించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతిని అనుసరించి ప్రజలకు సమాచారం అందిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి, డీఎఫ్‌వో భవిత పాల్గొన్నారు.

సీఈని కలిసిన యూనియన్ నాయకులు

మోతుగూడెం, జూలై3: సీలేరు కాంప్లెక్స్ సీఈగా బాధ్యతలు స్వీకరించిన జీఎం వాసుదేవరావును బుధవారం 327 యూనియన్ రీజనల్ సెక్రటరీ పి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు సీఈ దృష్టికి తీసుకెళ్లారు. సీఈ సానుకూలంగా స్పందించి మళ్లీ మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, ట్రెజరర్ జి.శ్రీను, బ్రాంచ్ ప్రెసిడెంట్ పి.శ్రీను, బ్రాంచ్ సెక్రటరీ టి.దుర్గాప్రసాద్, శర్మ, నరసింహమూర్తి, టి.శైలజ, దుర్గాదేవి, సుజాత, వరలక్ష్మి, ధనలక్ష్మి, సునీత, సులక్షణ, చిన్నమ్మడు తదితరులు ఆయనను కలిశారు.

సమస్యలపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల, జూలై3: అడ్డతీగలలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాల రహదారి ఛిద్రం అవ్వడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఎమ్మెల్యే శిరీషాదేవి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డును శుభ్రం చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించారు. అలాగే డ్రైనేజీ నుంచి దుర్గంధం వస్తుందని చెప్పడంతో ఆ సమస్యను కూడా గంట వ్యవధిలో పరిష్కరించారు.

ది. ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి

ఎన్నికల మహాజన సభ నోటీసు

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నియమావళి 1964లోని నియమము-22(3)(ఎ) ప్రకారము)

ది.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.3127, రాజమండ్రి యొక్క నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరపవలసియున్నది. ఈ ఎన్నికల ప్రక్రియ కొరకు తేది.20-7-2024 శనివారం ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 4గం॥ల వరకు లోకల్ నియోజకవర్గమునకు సంబంధించిన బ్రాంచిలు అనగా 1. మెయిన్ బ్రాంచ్ 2. ఫోర్ట్ గేట్ 3. తాడితోట 4. కాతేరు 5. స్వరాజ్యనగర్ 6. జె.ఎన్.రోడ్ 7. బొమ్మూరు 8. దానవాయిపేట లకు సంబంధించి ఎన్నిక మహాజన సభ ఎస్.కె.వి.టి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు అదే ఆవరణంలో వున్న ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం నందు జరుపుటకు మరియు నాన్‌లోకల్ నియోజకవర్గములకు సంబంధించిన బ్రాంచిలు అనగా 1. కాకినాడ 2. తాడేపల్లిగూడెం, 3. తణుకు 4. దివాన్‌చెరువు 5. భీమవరం 6. అమలాపురం 7. సీతమ్మధార (వైజాగ్) 8. గుంటూరులకు సదరు బ్రాంచ్ ఆవరణలో ఎన్నికల మహాజన సభ జరుపుటకు నిర్ణయించడమైనది. కావున ఓటు హక్కు కలిగిన యావన్మంది సభ్యులు తమ పాలకవర్గ సభ్యులను ఎన్నుకొను నిమిత్తం ఎన్నికల మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది. సదరు ఎన్నికల మహాజన సభకు హాజరగు సభ్యులు బ్యాంకు వారిచే ఇవ్వబడిన తమ ఫోటో గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరడమైనది.

సం/- వి. కృష్ణకాంత్, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్, కొవ్వూరు మరియు ఎన్నికల అధికారి
డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి
రాజమహేంద్రవరం, తేది.4-7-2024

ఎన్నికల ప్రకటన

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి

ఫారము-1

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని ది.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి యొక్క పాలకవర్గమునకు ది.20-07-2024 తేదీ శనివారం ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అథారిటీ రాజమహేంద్రవరం వారు నన్ను ఎన్నికల అధికారిగా నియమించినారు.

ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) బ్యాంకు పేరు, రిజిస్టర్డ్ నెం : ది. ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి
2) ఎన్నికల విధానం : రహస్య బ్యాలెట్
3) మొత్తము ఎన్నికల జరుగు స్థానములు మరియు ఎస్.సి/ ఎస్.టి./బి.త/ మరియు స్త్రీలు/ ఇతరులకు కేటాయింపు ఏమైనా ఉన్నచో : 12 (పన్నెండు) ఎట్టి రిజర్వేషన్లు లేవు
4) నియోజకవర్గములు సంఖ్య : 3

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య నుండి	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య వరకు	ఎన్నికలు జరుగు స్థానములు
నియోజకవర్గము-1 (లోకల్)			
1. మెయిన్ బ్రాంచ్	1	41923	10 (పది)
2. ఫోర్ట్ గేట్	41924	49555	
3 తాడితోట	49556	55875	
4. కాతేరు	55876	61050	
5. స్వరాజ్యనగర్	61051	64137	
6. జె.ఎన్.రోడ్	64138	70352	
7. బొమ్మూరు	70353	70436	
8. దానవాయిపేట	70437	70519	
నియోజకవర్గము- 2 (నాన్ లోకల్)			
1 కాకినాడ	70520	72606	1 (ఒకటి)
2. తాడేపల్లిగూడెం	72607	74102	
3. తణుకు	74103	74357	
నియోజకవర్గము-3 (నాన్ లోకల్)			
1. దివాన్‌చెరువు	74358	76972	1 (ఒకటి)
2. భీమవరం	76973	77416	
3. అమలాపురం	77417	78023	
4. సీతమ్మధార (వైజాగ్)	78024	78328	
5. గుంటూరు	78329	78423	

5. పోలింగ్ జరుగు తేది సమయం మరియు ప్రదేశము (పోటీ అనివార్యమైనపుడు) : ది.20-07-2024 శనివారం ఉదయం 8గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు

బ్రాంచి పేర్లు	ఎన్నికల జరుగు స్థలము
నియోజకవర్గము-1 (లోకల్)	
1. మెయిన్ బ్రాంచ్, 2. ఫోర్ట్ గేట్, 3. తాడితోట, 4. కాతేరు, 5. స్వరాజ్యనగర్, 6. జె.ఎన్.రోడ్, 7.బొమ్మూరు, 8. దానవాయిపేట	ఎస్.కె.వి.టి. ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట రాజమండ్రి మరియు అదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం
నియోజకవర్గము -2 (నాన్ లోకల్)	
1. కాకినాడ	డోరునెం.10-5-52, నాగేశ్వరరావు వీధి, రామారావు పేట, కాకినాడ, కాకినాడ జిల్లా
2. తాడేపల్లిగూడెం	ఎన్.టి.ఆర్.సెంటర్, మెయిన్‌రోడ్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా
3. తణుకు	డో.నెం.20-7-2/1, వార్డ్ నెం.21, వల్లూరి వారి వీధి, గవర్నమెంట్ బోయ్స్ హైస్కూల్ ఎదురుగా, తణుకు,ప.గో.జిల్లా
నియోజకవర్గము -3 (నాన్ లోకల్)	
1. దివాన్‌చెరువు	డోర్.నెం.1-123, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం రూరల్, తూ.గో.జిల్లా
2. భీమవరం	డోర్‌నెం.22-10-39, తటవర్తి వారి వీధి, తాలుకా ఆఫీస్ దగ్గర, భీమవరం, ప.గో.జిల్లా
3. అమలాపురం	డోర్ నెం.3-2-16, బ్యాంకు వీధి, కూచిమంచి అగ్రహారం, అమలాపురం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
4. సీతమ్మధార(వైజాగ్)	డో.నెం.50-40-1/1, పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్టణం, విశాఖజిల్లా.
5. గుంటూరు	డో.నెం.6-31-26, 10/4వ లైన్, టొంకరోడ్, ఠాగూర్ విగ్రహం వద్ద, అరండాల్‌పేట, గుంటూరు, గుంటూరు జిల్లా.

6. నామినేషన్ల స్వీకరణ తేది, సమయం ప్రదేశము (షె.కులము రూ 200/-, షె తగలు రూ.200/- వెనుకబడిన తరగతులు రూ. 400/- ఇతరులు రూ 1000/- నామినేషన్ రుసుముగా చెల్లించాలి) : ది.11-07-2024 గురువారం ఉ.11గం.ల నుండి సా.5 గం.ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్ వద్ద
7. నామినేషన్ల పరిశీలన తేది సమయము మరియు ప్రదేశము : ది.12-7-2024 శుక్రవారం ఉ.11గం.ల నుండి ప్రధాన కార్యాలయం, ది.ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద.
8. నామినేషన్ల ఉపసంహరణ తేది సమయము మరియు ప్రదేశము : ది.13-7-2024 శనివారం ఉ.11 గం.ల నుండి సా.5 గం. వరకు ప్రధాన కార్యాలయం, ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్ వద్ద
9. ఓట్ల లెక్కింపు జరుగు తేది సమయము మరియు ప్రదేశము : ది.21-7-2024 ఆదివారం ఉ.8 గం.ల నుండి ఎస్.కె.వి.టి.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు అదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం)
10. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేదీ, సమయము మరియు ప్రదేశము : ది.21-7-2024 ఆదివారం కౌంటింగ్ పూర్తయిన పిదప, ఎస్.కె.వి.టి.ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు అదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి. డిగ్రీ (వై.జంక్షన్) కళాశాల రాజమహేంద్రవరం
11. ఆఫీస్ బేరర్ల ఎన్నిక, పాలక మండలిలో భర్తీ కాని స్థానములను మరియు ఖాళీలగు స్థానములను కో-ఆప్షన్ ద్వారా భర్తీ చేయుట : ది.22-7-2024 సోమవారం ఉ.8గం.ల నుండి ప్రధాన కార్యాలయం, దిఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద

గమనిక: బ్యాంక్ సభ్యులు బ్యాంకు యొక్క బ్రాంచిల నందు గల నోటీసు బోర్డులో ఉంచబడిన ఓటింగ్‌కు అర్హత గల సభ్యుల జాబితాను పరిశీలించు కోవచ్చును.

సం/- వి.కృష్ణకాంత్
డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్,
కొవ్వూరు మరియు ఎన్నికల అధికారి
ది.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.3127, రాజమండ్రి

రాజమహేంద్రవరం
తేది.4-7-2024

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపు

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 3: నగరంలోని జగన్నాథపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా రూ.8,89,127 ఆదాయం వచ్చింది. కాకినాడ దేవదాయశాఖ తనిఖీదారు, భక్తులు, స్థానికుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. 3 నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సత్యవాణి తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్

పెద్దాపురం, జూలై 3: దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించే విద్యాసంస్థ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ పెద్దాపురంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కళాశాలలకు నోటీసులు జారీ చేసనట్టు విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ(వి), ఏఐఎస్ఎఫ్‌కు చెందిన విద్యార్థి సంఘం నాయకులు కె.సతీష్, గోవిందరాజు మయూరి మాట్లాడుతూ ఇటీవల నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి టెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. బంద్‌పై పట్టణం, మండలంలో ప్రచారం చేశారు.

జగ్గంపేట: దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని స్థానిక పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఆయా విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చాయి. పీడీఎస్‌యూ(వీ) జిల్లా కార్యదర్శి కె.సతీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకురాలు యమూరి ఉన్నారు.

రౌతులపూడి: దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వరహాలు ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ పరీక్షా లీకేజీ తెర వెనుక కుంభకోణం బయటపెట్టాలని, సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

గ్రాడ్యుయేషన్ డే, సామూహిక సీమంతాలు

కరప, జూలై 3: స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే, గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా జరిగాయి. ఐసీడీఎస్ కాకినాడరూరల్ ప్రాజెక్టు సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి తద్వారా ఆరోగ్యవంతమైన సమాజానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, గాజులు అందజేశారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాలందజేశారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, సెక్టార్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, నాయకులు బోగిరెడ్డి కొండబాబు, యాళ్ల పండు పాల్గొన్నారు.

'హత్రాస్ మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాలి'

గొల్లప్రోలు, జూలై 3: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్ జిల్లా రతిబాన్‌పూర్ గ్రామంలో సత్సంగ్‌లో జరిగిన విషాద సంఘటనలో మృతిచెందిన భక్తులకు రూ.50లక్షలు, గాయపడిన వారికి రూ.10లక్షలు వంతున పరిహారం అందజేయాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య ప్రతినిధులు గొల్లప్రోలులో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ ప్రమాదానికి నిర్వాహకులు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, బత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్: హత్రాస్‌లో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారం చెల్లించాలని రైతుకూలీసంఘ నేత కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. రంగవల్లి నగర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు యూపీ సీఎం బాధ్యత వహించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఏపీఆర్‌సీఎస్ నాయకుడు డివిజన్ నాయకులు దేశెట్టి సురేష్, సోమరాజు, దేవి, అర్జున, కరుణ పాల్గొన్నారు.

'104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి'

పిఠాపురం, జూలై 3: రాష్ట్రవ్యాప్తంగా 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధులు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న 326మందిని వైద్యఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖల్లో కాంట్రాక్టు డ్రైవర్లుగా నియమించాలని, గతంలో ప్రభుత్వం చర్చల్లో అంగీకరించిన విధంగా 64మంది డ్రైవర్లకు స్లాబ్‌లు ప్రకారం వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సెలవులు వర్తింపచేయాలని, బదిలీలకు అవకాశం కల్పించడంతో పాటు ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని విన్నవించారు. లోకేశ్‌ను కలిసినవారిలో ఎంప్లాయిస్ ప్రతినిధులు ఏవీ నాగేశ్వరరావు, వీఆర్ ఫణికుమార్, సీహెచ్.రాంబాబు తదితరులు ఉన్నారు.

'మోదీకి రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలి'

సర్పవరం జంక్షన్, జూలై 3: లోక్‌సభలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణం ప్రధానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు, మీడియా ప్రతినిధి తుమ్మలపల్లి నాని డిమాండ్ చేశారు. బుధవారం సర్పవరం జంక్షన్‌లో కాళ్ల ధనరాజు ఆధ్వర్యంలో మోదీపై రాహుల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఇద్దరు బాలురపై పిచ్చికుక్క దాడి

జీజీహెచ్ (కాకినాడ), జూలై 3: కాకినాడ జగన్నాథపురం పద్మానగర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బుధవారం స్థానిక ముత్తానగర్‌లో ఓ పిచ్చి కుక్క దాడి చేసి 11 ఏళ్ల బాలుడు వెంకట్, 8ఏళ్ల నానిలపై దాడి చేసి కాట్లు వేసింది. పిచ్చికుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత చిన్నారులను స్థానికులు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులు వారిద్దరికి ఏఆర్‌వీ ఇంజక్షన్ చేశారు. ఇందులో ఓ చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. సిటీలో వీధి కుక్కలు, పిచ్చి కుక్కల సంఖ్య పెరిగిపోయిందని, కనిపించిన వాళ్లపై కుక్కలు దాడి చేసి కరిచేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కల నివారణకోసం నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

కాకినాడ క్రైం, జూలై 3: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ ఆదేశాలతో ఎస్‌డీపీవో హనుమంతరావు పర్యవేక్షణలో కాకినాడ ట్రాఫిక్ సీఐలు డ్రంక్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు పోలీసులు నిర్ధారించి, కోర్టులో హాజరు పరిచారు. వారి ముగ్గురికి తలో రూ.10 వేలు జరిమానా విధిస్తూ నాలుగో ఏజెఎఫ్‌సీఎం జడ్జి తీర్పునిచ్చినట్టు సీఐలు చెప్పారు.

ఉపాధి కూలీల ఆందోళన

కరప, జూలై 3: పనులు కల్పించాలని, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఎదురుగా బుధవారం ఉపాధి హామీ పథకం కూలీలు ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కూలీసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో నాలుగు గ్రామాల్లో కూలీలకు అసలు పని కల్పించడంలేదన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. సంఘ నాయకులు చోడిశెట్టి కృష్ణ, పొట్లకాయల కృష్ణ, కొర్ల శ్రీను, మందనక్క జగ్గారావు, కలవల శేషగిరిరావు, దడాల సుబ్బారావు పాల్గొన్నారు.

డయేరియా మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

తొండంగి, జూలై 3: కొమ్మనాపల్లి గ్రామంలో ఇటీవల డయేరియా వ్యాధితో మృతిచెందిన దొడ్డి నాగమణి కుటుంబానికి తునికి చెందిన దాడిశెట్టి శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందించారు. మృతురాలి పిల్లల దీన పరిస్థితిని వివరిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందించిన శ్రీనివాస్ తన ప్రతినిధులను పంపి రూ.50వేల సాయం అందించారు. దీంతో పాటు నిత్యావసర సరుకులు, పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలు, దోమ తెరలు తదితర వస్తువులను ఆయన పంపించారు.

బాల్యవివాహాలపై కళాజాత

గండేపల్లి, జూలై 3: మండలంలోని మల్లేపల్లిలో బుధవారం బాల్య వివాహాలు, అతిసారంపై కళాజాత నిర్వహించారు. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ, ఎంఈవో హెచ్.నాయక్ హాజరయ్యారు. బాల్య వివాహాలు నేరమని, బాల్య వివాహాలు జరిగితే 1098 లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుధామాధురి, ఎ.నాగపార్వతి, సర్పంచ్ బి.గంగరాజు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

గండేపల్లి, జూలై 3: వివాహిత అదృశ్యంపై గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పెదపూడి మండలం గండ్రేడు గ్రామానికి చెందిన సుంకర రామకృష్ణ, అతడి భార్య సుంకర భవానీకి కుటుంబ కలహాల నేపథ్యంలో గొడవ అవడంతో గత నెల 6న గండేపల్లిలో అత్తగారి ఇంటి నుంచి భవానీ ఎవరికి చెప్పకుండా తన రెండేళ్ల కుమారుడిని ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆచూకీ కోసం వెతికినా దొరకపోవడంతో బుధవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆమె భర్త రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో ఉమెన్‌హెడ్ కానిస్టేబుల్ వెంకటలక్ష్మి కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాకినాడరూరల్, జూలై3: దీర్ఘకాలికంగా పరిష్కారంకాని ఉద్యోగ, ఉపాధ్యాయ, ఫెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బహుజన టీచర్స్ అసోషియేషన్(బీటీఏ) నాయకులు బుధవారం కాకినాడ డీఈవో పిల్లి రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేసారు. కార్యక్రమంలో బీటీఏ సంఘ అధ్యక్షులు శరత్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు వింటూ..పరిష్కరిస్తానని హామీలిస్తూ!

» వినతులు స్వీకరించిన డిప్యూటీ సీఎం పవన్ » చేబ్రోలులో నివాసానికి పోటెత్తిన ప్రజలు, వివిధ సంఘాల నేతలు » కొత్తపల్లిలో పర్యటన



చేబ్రోలులో వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న పవన్



కొత్తపల్లి: వాకతిప్ప రక్షిత మంచినీటి పథకంలో మంచినీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్



కొత్తపల్లి: కొండెవరంలో చక్రధర్ కుటుంబాన్ని ఓదారుస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, జూలై 3: తనను కలిసి వినతులు ఇచ్చేందుకు వచ్చిన వారి దగ్గరకు వెళ్లి వారి సమస్యలు వింటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో గల పవన్ నివాసానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సంఘాల ప్రతినిధులు, ప్రజలు వినతులు ఇచ్చేందుకు భారీగా తరలివచ్చారు. కొత్తపల్లి మండలంలో పర్యటనలను ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం నివాసం చేరుకున్న పవన్‌కు తన కోసం ఎదురుచూస్తున్న వారి వద్దకు వచ్చారు. వారి సమస్యలను సావదానంగా ఆలకించారు. చంద్రంపాలెం గ్రామానికి చెందిన వానరాశి బుజ్జి యూరిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తన తల్లితో కలిసి పవన్‌ను కలవగా వారి ఇబ్బందిని తెలుసుకున్న పవన్ తల్లిదండ్రులతో కలిసి అతడిని వైద్యానికి హైదరాబాదు పంపిస్తానని హామీ ఇచ్చారు. అమలాపురానికి చెందిన 80 ఏళ్ల ముత్యాల మణికుమారి పవన్‌ను కలిశారు. అమ్మవారి ఫోటో, కుంకుమ అందజేశారు. ఈమె జనసేనలో క్రియాశీలకంగా ఉంటూ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేశారు. ఆమెను కలుసుకున్న పవన్ క్షేమసమాచారాలపై ఆరా తీశారు. పవన్‌ను ఏపీ స్టేట్ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అండ్ స్టూడెంట్స్ యూనియన్ ప్రతినిధులు కార్యదర్శి డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో కలిసి సమస్య వివరించగా త్వరలోనే పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆయుష్ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పవన్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూవీకే శాస్త్రి ఉన్నారు. జయలక్ష్మి సొసైటీ బ్యాంకులు డిపాజిట్లు చేసి పూర్వ పాలకవర్గం నిర్వాకంతో నష్టపోయిన డిపాజిటర్లు, ఖాతాదారులు పవన్‌ను కలిసేందుకు వచ్చారు. పవన్ వెంట కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు కూడా ఉన్నారు. ఎక్సైజు శాఖను ఏకీకృతం(యూనిఫికేషన్) చేయాలని ఎక్సైజ్‌శాఖలోని అన్ని సంఘాల జేఏసీ ప్రతినిధులు చేబ్రోలు నివాసంలో పవన్‌ను కలిసి కోరారు. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు తన పేషీకి రావాలని సంఘ ప్రతినిధులకు పవన్ సూచించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు కేవీ.నాగప్రసాద్, ఈఎస్ ఎస్‌కేడీవీ ప్రసాద్, జేఏసీ ప్రతినిధులు కేవీఎన్ ప్రభుకుమార్, వీవీఎస్ఎన్ వర్మ, ఆర్‌బీ పెద్దిరాజు, రత్నాకర్, ఈ.స్వరాజ్యలక్ష్మి, పి.శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు : పవన్‌కల్యాణ్

కొత్తపల్లి, జూలై 3: గ్రామాల్లో ప్రతీ ఇంటికి 100 శాతం స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంగా దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. వాకతిప్ప సూరప్ప చెరువులో ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథక రిజర్వాయర్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. కొత్తపల్లి మండలంలో 54 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని అధికారులు పవన్‌కు వివరించారు. సమర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం, శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసే ట్యాంక్, నీటి స్వచ్ఛత జరిపే పరిశోధనా కేంద్రాలను పవన్ పరిశీలించారు. జలజీవన్ మిషన్‌కు మంజూరైన నిధులపై ఆరా తీశారు. ప్రస్తుతం ఉన్న ట్యాంక్ సామర్థ్యాన్ని పెంచాలని దానికి సంబంధించి రూ.12కోట్ల మేర నిధులు అవసరం ఉంటుందని, ప్రతిపాదనలు తయారుచేస్తున్నామని ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ పవన్‌కు వివరించారు. ప్రేమించిన యువతి పోలీసు కేసు పెట్టడంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడిన కొండెవరం ఇందిరానగర్‌కు చెందిన చక్రధర్ కుటుంబాన్ని డిప్యూటీ సీఎం ఓదార్చారు. ఆయన కాన్వాయ్‌కు అడ్డంగా వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు కోరారు. వెంటనే కారు దిగిన పవన్ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తమ కాలనీ వాసులు దూర ప్రాంతం నుంచి తాగునీరు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని యండపల్లి జంక్షన్ దళితవాడ గ్రామస్తులు పవన్‌కు మొరపెట్టుకున్నారు. కాలనీ ప్రజల కోరిక మేరకు ఆయన పర్యటించారు. మంచినీటి సదుపాయాన్ని కల్పించేందుకు అధికారులతో చర్చిస్తానని పవన్ హామీ ఇచ్చారు.

'గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి'

ప్రత్తిపాడు, జూలై 3: ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధికి నోచుకోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి తోడ్పాటునందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విజ్ఞప్తి చేశారు. బుధవారం సత్యప్రభ చేబ్రోలు క్యాంపు కార్యాలయం వద్ద పవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సబ్‌ప్లాన్ గ్రామాలు కనీస మౌలిక వసతులు నోచుకోకుండా ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని విస్మరించిందన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని తాగునీరు, రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.



ప్రత్తిపాడు: డిప్యూటీ సీఎం పవన్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల

టీడీపీలోకి అచ్చినాయుడు

తుని రూరల్, జూలై 3: టీడీపీలోకి లోవ దేవస్థానం పాలక మండలి చైర్మన్ గొర్రె అచ్చినాయుడు చేరారు. తేటగుంటలోని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అతిథిగృహంలో యనమల సమక్షంలో ఆయన టీడీపీలో చేశారు. యనమల మాట్లాడుతూ అచ్చినాయుడు తిరిగి సొంతగూటికి చేయడం శుభపరిణామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు గాడి రాజబాబు, చిరంజీవి రాజు, అప్పలనాయుడు, దూలంమాణిక్యం ఉన్నారు. తుని ఛాంబర్ ఇండస్ట్రీ సభ్యులు ఎమ్మెల్యే దివ్య, శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడిని తేటగుంటలో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్తక సంఘ సభ్యులు దివ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఛాంబ ర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు సుకురు నాగేంద్ర నెహ్రూ, సెక్రటరీ పెనుగొండ రాజాబాబు, ట్రెజరీ టి.సురేష్ ఉన్నారు.

'అభివృద్ధే లక్ష్యం'

తుని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేసి రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ ఎక్స్ ఆఫీషియో నెంబర్‌గా ఆమె బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. పట్టణంలో రూ.27లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ప్రారంభించారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తా

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

సామర్లకోట, జూలై 3: స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు ఏఏ పార్టీలకు చెందిన వారన్నది కాదు. అభివృద్ధే ముఖ్యం. అంతుకు తనతో కలిసి ముందుకొస్తే అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాను. కాదంటే పర్యవసానం నాలో చూస్తారంటూ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హెచ్చరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజప్ప మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేఖంగా అభివృద్ధి పనులకు తిలోదకాలిచ్చే వారిని ప్రజలకు ఇంటికి పంపుతారన్నది అందరూ గుర్తెరగాలన్నారు. ఇటీవల వేట్లపాలెంలో డయేరియా బారిన పలువురు పడడంతో వైద్యబృందం తగుచర్యలు చేపట్టగా డయేరియా పూర్తిగా అదుపులోకి తెచ్చిందని అభినందించారు. అంతకుముందు తొలిసారిగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న రాజప్ప కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీజీ, అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాలు ఏర్పాటుచేసిన ప్రాంతంలో శిలాఫలకంలో తన పేరును చేర్చకపోవడంపై ఎంపీపీ సత్తిబాబుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహశీల్దార్ మైత్రీనివాస్, ఈవోపీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి, కార్యాలయ ఏవో మంగతాయారు అధికారులున్నారు. పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డేటాఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ ఈ- పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల అసోసియేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ఆర్.మాధవి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతి పత్రాన్ని బుధవారం సామర్లకోటలో అందజేశారు.

'చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి'

ప్రత్తిపాడు, జూలై 3: చిరుధాన్యాల సాగుపై జిల్లాలోని రైతులను ప్రోత్సహించాలని శాఖ వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల వ్యవసాయ సహాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేడీ మాట్లాడుతూ తక్కువ ఖర్చు, తక్కువ నీటితోపండే చిరుధాన్యాలసాగు రైతులకు ఎంతో మేలు, ఆదాయం సమకూరుస్తుందని తెలిపారు. రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి మాట్లాడుతూ రాగి పంట పండించే విధానాలను వివరించారు. సమావేశంలో జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు వైవీ గంగాధర్‌కుమార్, ఏలేశ్వరం వ్యవసాయాధికారి జ్యోతి, టెక్నికల్ అధికారి పద్మజ, శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుందని జేడీ విజయకుమార్ అన్నారు. ఏవో బి.జ్యోతి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం సందర్శన, పీఎమ్‌డీఎస్ విధానాన్ని సందర్శించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులు అప్పలనాయుడు, కె.సింహాద్రి, సత్యనారాయణ, రాజారత్నం వెంకటలక్ష్మీపార్వతి, చిన్నబాబు ఉన్నారు.

శంఖవరం: శంఖవరంలో ఏడీఏ ఎస్.బుల్లిబాబు ఆధ్వర్యంలో ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో జేడీ ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడారు. ఏవోలు రెడ్డి ఈశ్వర్, అశోక్, సలీం తదితరులు ఉన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 3: ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా పని చేస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. బుధవారం గొడారిగుంటలో వివిధ సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు పాల్గొన్నారు. ఫైడా సెంటర్‌లో ఆంధ్రకాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో సినీ నటుడు ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే నానాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగ స్థల నటులు దువ్వూరి శేషుకుమారి, కుమారి విజయ, గన్ని నాగేశ్వరి, మహంతి రమణ, శిరీషలను సత్కరించారు.

పాస్టర్లకు సత్కారం

జగ్గంపేట, జూలై 3: రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మండలం పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో జాతీయ క్రైస్తవ దినోత్సవాన్ని నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేవరుపుల సత్యప్రభ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ హాజరై పలువురు పాస్టర్లను సత్కరించారు. జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట శ్రీ వినాయకరావులమ్మ తాపీమేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతుల నవీన్, టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రంలను సత్కరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 3: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. డయేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ ప్రజారోగ్య విభాగాలకు చెందిన అధికారులతో బుధవారం కమిషనర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావుతోపాటు వివిధ విభాగాధిపతులు హాజరయ్యారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. కాకినాడ కమిషనర్ జన్మభూమి పార్కును సందర్శించి అక్కడి సమస్యలను సందర్శకులతో మాట్లాడి తెలుసుకున్నారు.

'ద్వారంపూడి అనుచరుడు చంపుతానని బెదిరిస్తున్నాడు'

కాకినాడ సిటీ, జూలై 3: కాకినాడ గొడారిగుంట రాజ్యలక్ష్మీనగర్‌లో అక్రమ కట్టడం కూల్చివేతకు వచ్చిన మున్సిపల్ అధికారులపై దౌర్జన్యానికి దిగిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడు బళ్ల సూరిబాబు ఈ ఘటనతో తనకు సంబంధం లేకపోయినా చంపుతానని బెదిరిస్తున్నాడని, అతడి బారి నుంచి తనకు, తన కుటుంబసభ్యులకు ప్రాణరక్షణ కల్పించాలని ఏడో డివిజన్ మాజీ కార్పొరేటర్, టీడీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీకోటి అప్పలకొండ జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గొడారిగుంటలోని కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అప్పలకొండ మాట్లాడుతూ ఈ కూల్చివేత తానే చేయించానని పోలీసు, పబ్లిక్ ఎదురుగా తనకు చంపేస్తానని సూరిబాబు బెదిరించాడన్నారు. మంగళవారం రాత్రి 10 మంది అనుచరులతో తన ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహించాడని వివరించారు. సమావేశంలో ఎస్సీ, బీసీ నాయకులు పోలిపల్లి జగన్, గంజా శివయ్య, నాగేంద్ర ప్రసాద్ ఉన్నారు.

'స్థలాన్ని కబ్జా చేశారు'

కాకినాడ సురేష్‌నగర్ ఆర్టీవో ఆఫీసు రోడ్‌లో తన తల్లి గంజా లక్ష్మి పేరు మీద గల స్థలాన్ని వైసీపీ కార్యకర్తగా పని చేస్తున్న బళ్ల సూరిబాబు, అతడి అనుచరులు కబ్జా చేశారని, తనను చంపేస్తామని చెదిరించడంతో ఇంతవరకు ఫిర్యాదు చేయలేదని స్థానిక 4వ డివిజన్ టీడీపీ కార్యదర్శి గంజా శివయ్య వాపోయారు. కాకినాడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూరిబాబు, అతడి అనుచరులపై చర్యలు తీసుకుని తమ స్థలాన్ని ఇప్పించవలసిందిగా కోరారు.

పి.మల్లవరంలో ప్రత్యేక పూజలు

పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

తాళ్లరేవు, జూలై 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి అమ్మవారి దీక్షకు మద్దతుగా జనసైనికుడు వివివికే ప్రసాద్, మణిదంపతుల ఆధ్వర్యంలో పి.మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పార్వతి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కండవల్లి శ్రీరంగాచారులు, శ్రీనివాసాచార్యులు ఎమ్మెల్యే దాట్ల, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. పీటలపై కూర్చుని పూజలు చేస్తున్న జనసైనికుడు దంపతులను ఎమ్మెల్యే దంపతులు ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జనసైనికులు, టీడీపీ, బీజేపీ నేతలకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసైనికులు అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్, పోలిశెట్టి సూర్య ప్రకాష్, ముత్యాల జయలక్ష్మి, టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, మందాల గంగసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

శంఖవరం, జూలై 3: దివ్యాంగుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 70 మంది పింఛనుదారులు కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లు పెంచినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఓలేటి లక్ష్మీనారాయణ, మట్ల పెద్దరాజు వైరా సత్యనారాయణ, అంకం శ్రీను, నడిగట్ల సూరిబాబు, బొబ్బరాల చక్రరావు, కన్నయ్య, సత్తిబాబు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భర్త మృతి

తాళ్లరేవు, జూలై 3: కేంద్రపాలిత ప్రాంతం యానాం ఎటుగట్టుపై జరిగిన రోడ్డుప్రమాదంలో గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ భర్త సూరిబాబు(57) బుధవారం మృతిచెందాడు. సూరిబాబు యానాం నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చి దారిమధ్యలో రోడ్డుపై ఉండగా యానాం నుంచి గోవలంకకు వెళ్తున్న 200 ఎక్స్‌కవేటరు ట్రాలీ ఢీకొట్టగా సూరిబాబు మృతిచెందాడు. మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రత్తిపాడు, జూలై 3: మండంలోని ఉత్తరకంచి గ్రామంలో అలువేలు మంగ పద్మావతి దేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గరుడవాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించి అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'కొత్త లేబర్ కోడ్లను రద్దు చేయాలి'

జగ్గంపేట, జూలై 3: మోదీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రామ్‌సింగ్ కోరారు. అసంఘటితరంగ కార్మికుల కోసం ఐఎఫ్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. టైల్స్ ఫ్యాక్టరీ కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

పెద్దాపురం, జూలై 3: ప్రధాని మోదీ ఇచ్చిన అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమం పిలుపు మేరకు బుధవారం పెద్దాపురంలో బీజేపీ నాయకులు తమ బూత్ వార్డుల్లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో బిక్కిన విశ్వేశ్వరరావు, అల్లు ప్రసాద్, యాళ్ళ నాని, సతీష్, చీకట్ల నాగేశ్వరరావు, బర్ల శ్రీను, పొన్నూరు మణికంఠ, కేదారిశెట్టి సత్యప్రకాష్, నాగశివ, రేపాక ప్రసాద్, తోట రామకృష్ణ లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 3: ప్రతిరోజూ కాలేజీకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న ఆర్యవైశ్య నిరుపేద మేధాశ్లోకకు వాసవీ వైశ్య ఫ్రెండ్స్ కన్వీనర్ చెక్క రమేష్ ఆధ్వర్యంలో సైకిల్ బహూకరించారు. ఫైడా వెంకటనారాయణ, గ్రంధి గణేష్, దాతల సహకారంతో సైకిల్ ఇచ్చారు. అప్పన అమర్నాధ్, కూరపాటి సూరిబాబు, బలభద్రుని రమేష్, బందరు మిఠాయినెహ్రూ, కంచర్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

సామర్లకోట, జూలై 3: భారత క్రైస్తవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులకు సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు అందజేశారు. రిక్షా కార్మికులు, పేదలకు దుప్పట్లు, బిరియానీ పొట్లాలను అందజేశారు. పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సాల్మన్‌రాజు, వి.జాన్, ఆర్.లాజరస్, ఏ.చంటి, విశ్వాసరావు, టి.బ్లెస్సింగ్ పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

పెద్దాపురం, జూలై 3: భారత క్రైస్తవ దినోత్సవం సందర్భంగా బుధవారం పెద్దాపురంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. దర్గాసెంటర్లో మనిల్లులో ఆశ్రయం పొందుతున్న వారికి ఆహారం అందజేశారు. క్రిస్టియన్‌పేటలో ఆదరణ ఆశ్రమంలో నిరాశ్రయులకు ఆహారం అందించారు. క్లాప్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పురుషోత్తం దాస్ లంక, టి.బ్లెస్సింగ్, సీబీఐ కుమార్, జీ.జాన్‌మోజెస్ తదితరులున్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

రౌతులపూడి, జూలై 3: లచ్చిరెడ్డిపాలెనికి చెందిన ఉపాధి కూలీ బి.పెద్దాపురం పాముకాటుకు గురయ్యాడు. పడాల చెరువులో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తోటి కూలీలు ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది.